క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



కనకమహాలక్ష్మి అమ్మవారి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారి చిత్రపటం వద్ద పలువురు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్గశిర మాసంలో భాగంగా ఇందిరమ్మ కాలనీకి వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు. యాతపేట సేవా సంఘం, సాయిగణేష్ ఆటో యూనియన్, ఇందిరమ్మ కాలనీ వాసుల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు.

'చలో అమరావతి'కి తరలిరావాలి



చలో అమరావతి కర పత్రాలను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు సభ్యులు

అచ్యుతాపురం: ఈ నెల 19న నిర్వహించే చలో అమరావతికి తరలిరావాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు తట్టా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండలంలోని మడుతూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద కర పత్రాలను ఆయన ఆవిష్కరించారు. అమరావతిలో ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు వి.ఎల్.రాజు, వడ్లమూరి కృష్ణ, స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

నాగవరంలో నేడు రెవెన్యూ సదస్సు

మునగపాక: మండలంలోని నాగవరంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరుగుతుందని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ ప్రాంగణంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రామాల్లో సుస్థిర అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీడీవో జయప్రకాష్‌రావు

పాయకరావుపేట: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో జయప్రకాష్‌రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పేదరికం లేని మెరుగైన జీవన విధానం కల్పించాలని, తాగునీటి సమస్య లేకుండా ఉండాలని, సామాజిక వసతులు, సురక్షితమైన గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. 4 రోజుల పాటు 4 గ్రూపులుగా సచివాలయ సిబ్బందికి, సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, గ్రామ కార్యదర్శులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కల్పిస్తామని ఎంపీడీవో తెలిపారు.

మునగపాక పీహెచ్‌సీ సందర్శన



మునగపాక పీహెచ్‌సీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: మునగపాక పీహెచ్‌సీని గురువారం యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సందర్శించారు. పీహెచ్‌సీకి నూతనంగా ల్యాబ్ నిర్మించేందుకు రూ.50 లక్షలు మంజూరు కావడంతో ఆయన స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఆస్పత్రిలోని మందులు, రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవల వివరాలను వైద్యాధికారి విమలగిరిని అడిగి తెలుసుకున్నారు.

అటకెక్కిన ఏపీ ఫైబర్ నెట్

- గ్రామ సచివాలయాల్లో అలంకారప్రాయంగా యూనిట్ బాక్స్‌లు
- ఇంటర్‌నెట్ సౌకర్యం లేక సిబ్బంది అవస్థలు
- సొంత మొబైల్ ఫోన్ల డేటాతో నెట్టుకొస్తున్న వైనం



తిమ్మాపురం సచివాలయంలో నిరుపయోగంగా ఏపీ ఫైబర్ నెట్ యూనిట్ బాక్సు

ఎస్.రాయవరం: గ్రామాల్లో ఏపీ ఫైబర్ నెట్ సేవలు అటకెక్కాయి. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఏపీ ఫైబర్ నెట్ యూనిట్లు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అలంకారప్రాయంగా మిగిలాయి. సచివాలయాలకు హైస్పీడ్ ఇంటర్ నెట్, తద్వారా గ్రామంలో ఇంటింటికీ తక్కువ రేటుకే కేబుల్ కనెక్షన్లలో భాగంగా ఈ యూనిట్లు ఏర్పాటు చేశారు. ఎస్.రాయవరం మండలంలోని గ్రామాల్లో సుమారు 80 శాతం సచివాలయాల్లో ఈ బాక్సులను అమర్చారు. సచివాలయాలకు హైస్పీడ్ ఇంటర్‌నెట్, ఆపై గ్రామంలో తక్కువ రేటుకే ఇంటర్ నెట్ కనెక్షన్ ఇవ్వడమే ఈ పథకం లక్ష్యం. ఒక యూనిట్ ఏర్పాటు కోసం సుమారు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వెచ్చించారు. అయితే ఏడాది క్రితం ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ సార్వత్రిక ఎన్నికల తరువాత పత్తా లేకుండా పోయాడని అధికారులు చెబుతున్నారు. సచివాలయ భవనాల్లో ఏర్పాటు చేసిన ఈ బాక్సులు ప్రస్తుతం నిరుపయోగంగా పడి ఉన్నాయి.

వేధిస్తున్న సిగ్నల్ సమస్య

మండలంలో దాదాపు 50 శాతం గ్రామాల్లో సిగ్నల్ సమస్య ఉంది. అయితే ప్రభుత్వ పనులు పూర్తి కావడం కోసం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆయా గ్రామాల్లో సిగ్నల్ వచ్చే తమ మొబైల్ డేటాతో పనులు కానిచ్చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఇంటర్‌నెట్ పనిచేయడం లేదని షాకులు చెప్పి, పనులు వాయిదా వేస్తున్న సందర్భాలూ ఉన్నాయి. మరికొన్ని గ్రామ సచివాలయాల్లో పంచాయతీల నుంచి నెలవారీ బిల్లులు చెల్లించి ప్రవేట్ ఇంటర్ నెట్ సదుపాయం పొందుతున్నారు. మేజర్ పంచాయతీలైన తిమ్మాపురం, దార్లపూడి, ఎస్.రాయవరం గ్రామాలతో పాటు పెద్ద గ్రామాలు కొరుప్రోలు, పెనుగొల్లు, పి.ధర్మవరం, వమ్మవరం, పెదగుమ్ములూరు, చినగుమ్ములూరు, బంగారమ్మపాలెం, రేవుపోలవరం, సైతారుపేట, ఉప్పరాపల్లి, లింగరాజుపాలెం, తదితర గ్రామాల్లో నిత్యం వినియోగదారుల రద్దీ ఉంటుంది. ఈ గ్రామాల్లో ఇంటర్‌నెట్ సేవలు అంతంతమాత్రంగా ఉండడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఫైబర్‌నెట్ యూనిట్ బాక్సుల ద్వారా ఇంటర్ నెట్ సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాలని సచివాలయ సిబ్బంది, ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేసిన ఈ ఫైబర్‌నెట్ సర్వీస్ ఎందుకు పని చేయడం లేదన్న సందేహం అధికారుల్లో రాకపోవడం విడ్డూరంగా ఉంది.

ఫైబర్‌నెట్ సేవలు అవసరం



అభివృద్ధి చెందుతున్న తిమ్మాపురం, పెదగుమ్ములూరు పంచాయతీల్లో హైస్పీడ్ ఇంటర్‌నెట్ సదుపాయం అవసరం. ఆధార్, ఇతర సేవల కోసం ప్రజలు సచివాలయం, ఇంటర్‌నెట్ సెంటర్లను ఆశ్రయిస్తుంటా రు. సచివాలయాల్లో తరచూ ఆన్‌లైన్ సేవలు మొరాయిస్తున్నాయి. మూలన పెట్టిన ఏపీ ఫైబర్ నెట్‌ను వినియోగంలోనికి తీసుకురావాలి.

–దారబోయిన సత్యనారాయణ, వినియోగదారుడు, కోనవానిపాలెం

పరిశీలించి వినియోగంలోకి తీసుకొస్తాం..



గ్రామ సచివాలయాల్లో ఏపీ ఫైబర్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఏడాది క్రితం ఏర్పాటు చేసిన ఈ యూనిట్లు పని చేయడం లేదని పంచాయితీ కార్యదర్శులు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. సచివాలయాల్లోని ఈ యూనిట్లను ఒక్కసారి పరిశీలిస్తాం. పని చేయకపోతే వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం.

–జి.సత్యనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో, ఎస్.రాయవరం మండలం

అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పాయకరావుపేట: అన్నదాతకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రైతులకు చేస్తున్న అన్యాయంపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయానికి వినతి పత్రం అందించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు పట్టణంలో గురువారం పార్టీ నాయకులతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, రైతులకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. దీనిని నిరసిస్తూ రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. రైతులకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రైతులందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, వైస్ ఎంపీపీలు ధనిశెట్టి మాధవి, తిరుమల్లేశ్వరరావు, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవాని శ్రీనివాస్, టౌన్ ప్రెసిడెంట్ ధనిశెట్టి మహేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, ఉప సర్పంచ్‌లు చిక్కాల సూర్యనారాయణ, నల్లబిల్లి సత్యనారాయణ, జగత శ్రీను, పద్మారావు, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే కూటమి కుట్రలు

- నీటి సంఘాల ఎన్నికలపై న్యాయ పోరాటం
- కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం



నక్కపల్లి: నీటి సంఘాల ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో కూటమి నేతలు కుట్రలకు పాల్పడుతున్నారని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వీసం రామకృష్ణ ఆరోపించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గొడిచర్ల కొత్తచెరువు, బాపిరాజు చెరువు, ఉద్దండపురంలో పెద్ద చెరువు ఆయకట్టు నీటి సంఘాలకు ఈ నెల 14న ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఈ సంఘాల్లో వైఎస్సార్ సీపీకి చెందిన మద్దతుదారులైన రైతులు ఎక్కువ మంది ఉన్నారన్నారు. ఈ మూడు సంఘాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. అయితే కూటమి నేతలు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తెచ్చి గలాటాలు సృష్టించి ఎన్నికలను వాయిదా వేయించడం, వైఎస్సార్‌సీపీ మద్దతుతో డైరెక్టర్లుగా పోటీ చేసే వారిపై అనర్హత వేటు వేయించే కుట్రలకు పాల్పడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ ఎన్నికల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించని పక్షంలో న్యాయ పోరాటం చేస్తామన్నారు. గొడిచర్లలో రెండు చెరువులకు జరిగే నీటి సంఘ ఎన్నికల్లో పోటీ చేసే రైతుల నుంచి అక్కడ వీఆర్వో నీటి తీరువా కట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నీటి తీరువా కట్టించుకోవాలని, లేని పక్షంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగుతామన్నారు. పక్షపాతంగా వ్యవహరించే అధికారులు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించరాు. మండలంలో జరిగే అన్ని నీటి సంఘాల ఎన్నికల్లోను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు పోటీ చేస్తారన్నారు.

సీఎస్ఆర్ నిధులతో జోరుగా అభివృద్ధి పనులు



పనులు ప్రారంభిస్తున్న సుబ్బారెడ్డి, రాజారెడ్డి

నక్కపల్లి: మండలంలో హెటెరో పరిశ్రమ పరిసర ప్రాంతాల్లో సీఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. కంపెనీ యాజమాన్యం సీహెచ్ఎల్ పురం గ్రామంలో సీసీ కాలువల నిర్మాణానికి సీఎస్ఆర్ ఫండ్ నుంచి రూ.15 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామంలో నిర్మించే సిమెంట్ కాలువ పనులను గురువారం కంపెనీ జీఎంలు సుబ్బారెడ్డి, కుళ్లాయిరెడ్డి, రాజారెడ్డి కొబ్బరి కాయకొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీ పరిసర ప్రాంత గ్రామాల్లో సీఎస్ఆర్ నిధులతో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఆర్‌వో ప్లాంట్లు, సిమెంట్ రోడ్లు, కాలువలు, పాఠశాలలకు ప్రహరీలు, కిచెన్ షెడ్లు, బోర్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం వీరవెంకటసత్యనారాయణ రెడ్డి, సీఎస్ఆర్ ప్రతినిధి శ్రీనివాస్, స్థానిక నాయకులు కర్రి అప్పారావు, సత్యనారాయణ, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

బొత్సను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



బొత్సతో వైఎస్సార్ సీపీ నాయకులు

పాయకరావుపేట: విశాఖ నుంచి రాజమండ్రి వెళ్తున్న వైఎస్సార్ సీపీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను స్థానిక వై జంక్షన్ వద్ద ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతు సమస్యలపై శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు రైతులు, నాయకులు కలిసి విజ్ఞాపన పత్రం అందించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బొత్స వారికి సూచించారు. పార్టీ టౌన్ ప్రెసిడెంట్ ధనిశెట్టి మహేష్, పాయకరావుపేట, పెంటకోట ఉపసర్పంచ్‌లు జగతా భవాని శ్రీనివాస్, చిక్కాల సూర్యనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, నాయకులు నల్లిబిల్లి సత్యనారాయణ, జగతా శ్రీను, పత్మారావు, మధు, తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాతతో ప్రభుత్వం చెలగాటం'



సత్యనారాయణరాజు

కోటవురట్ల: రైతులు కష్టాల్లో ఉంటే సరిగ్గా అదే సమయంలో నీటి సంఘాల ఎన్నికలు పెట్టడం దారుణమని మాజీ వైస్ ఎంపీపీ ఆర్.ఎస్.సత్యనారాయణరాజు విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరుస తుపానులతో అన్నదాత దిక్కుతోచని స్థితిలో అల్లాడుతుంటే రాష్ట్ర ప్రభుత్వ తీరు మాత్రం ఇళ్లు కాలిపోయి ఒకరుంటే.. బొగ్గులు కోసం ఇంకొకరు చూశారన్న చందంగా ఉందని ఎద్దేవ చేశారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజనులో అత్యధికంగా వరి పంట సాగు చేశారన్నారు. సరిగ్గా పంట కోతకు వచ్చిన సమయంలో తుపాను ప్రభావంతో గత 15 రోజులుగా రైతులు ఏమీ చేయలేని దుస్థితిలో ఉన్నారన్నారు. గింజ రాలిపోతుండడంతో రైతులు ప్రస్తుతం వరి కోతలు చేపడుతున్నారన్నారు. మరో తుపాను పొంచి ఉన్న కారణంగా రైతులు క్షణం తీరిక లేకుండా వరి కోతలు చేస్తున్నారన్నారు. కూలీలు దొరకని పరిస్థితుల్లో రైతులే ఒకరికొకరు సాయం చేసుకుంటున్నారని, ఇలాంటప్పుడు సందట్లో సడేమియా అన్నట్టు శనివారం నీటి సంఘాలకు ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. రైతులు ఖాళీ లేకుండా ఉన్న సమయంలో ఎన్నికలు పెట్టి దొడ్డిదారిలో టీడీపీ కార్యకర్తలకు పదవులు కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వరి కోతలు పూర్తయ్యేంత వరకు నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

పద్మారావు మృతి నాటక రంగానికి తీరని లోటు



రంగస్థల నటుడు పద్మారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మునగపాక వాసులు

మునగపాక: కళా రంగానికే వన్నె తెచ్చిన రంగస్థల నటుడు పద్మారావు మృతి బాధాకరమని మునగపాక మాజీ సర్పంచ్ టెక్కలి రమణబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మునగపాక సంతబయిలకు చెందిన రంగ స్థల నటుడు విల్లూరి పద్మారావు సంతాప సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పద్మారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమణబాబు మాట్లాడుతూ పద్మారావు పలు నాటికలు, నాటకాల్లో ప్రదర్శనలతో ప్రతిభ కనబరిచారన్నారు. పద్మారావు మృతి నాటకరంగానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఆడారి రాజు, వేగి రామకృష్ణ, శరగడం గణేష్, కాండ్రేగుల మణికంఠ, ఆడారి గోవింద, శరగడం జగన్, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



నక్కపల్లి ఆత్మీయ గోపురంలో కేక్ కట్ చేస్తున్న సోనివుడ్, వెంకటేష్ తదితరులు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆత్మీయ ప్రార్థన గోపురం వద్ద నిర్వాహకులు కోరాడ చంద్రరావు పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలకు ఏపీపీపీఎస్సీ మాజీ సభ్యుడు, సానా సంస్థ అధినేత సోనివుడ్, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కొప్పిశెట్టి వెంకటేష్, ఉప సర్పంచ్ వీసం రాజు, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరం కలిసి మెలిసి ఉండే సంప్రదాయం ప్రస్తుత సమాజంలో నెలకొందన్నారు. జీవితంలో తనకు తాను తగ్గించుకుని బతికే ఆలోచన బైబిల్ కల్పించిందన్నారు. మండలంలో పాస్టర్ల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతం వారు పలువురు క్రైస్తవ పెద్దల సమక్షంలో క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఫెలోషిప్ అధ్యక్ష, కార్యదర్శులు మాసరాజు, ఐజాక్, కోశాధికారి రాజు, గౌరవాధ్యక్షుడు జాన్‌డేవిడ్, ఉపాధ్యక్షుడు యెహోషువా, హైదరాబాద్‌కు చెందిన జాన్, పాయకరావుపేట మండల సీనియర్ దైవజనులు చార్లెస్ పిన్ని, ఆత్మీయ గోపురం నిర్వాహకులు చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై సోలార్ విద్యుత్ ప్లాంట్ల మంజూరు



పాములవాక రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్



సీహెచ్ఎల్ పురం సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ నర్సింహమూర్తి



సిరసపల్లి సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు



మాసాహేబుపేట రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

కోటవురట్ల: సోలార్ విద్యుత్ ప్లాంట్లను కేంద్ర ప్రభుత్వం రాయితీపై మంజూరు చేస్తోందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్ కోరారు. పాములవాకలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ సోలార్ విద్యుత్‌తో సాగు నీటి ఖర్చు తగ్గుతుందని, తద్వారా రైతులు ఎక్కువ లాభాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. తహసీల్దారు తిరుమలబాబు మాట్లాడుతూ ఈ సదస్సులో 31 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 6 దరఖాస్తులు సర్వే కోసం, 4 దరఖాస్తులు అడంగల్‌లో సవరణల కోసం, మ్యుటేషన్‌కు 5, వారసత్వ పట్టాదారు పాసు పుస్తకం కోసం 3, మిగిలినవి వివిధ సమస్యలపై వచ్చినట్టు తెలిపారు.

అర్జీలను ఆన్‌లైన్ చేసి పరిష్కరిస్తాం..

నక్కపల్లి: రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలన్నింటిని ముందుగా ఆన్‌లైన్ చేసి తర్వాత పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి తెలిపారు. గురువారం సిహెచ్ఎల్ పురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూములను ఆన్‌లైన్ చేయాలని, పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేయాలని, తదితర అంశాలపై రైతులు అర్జీలు అందజేశారు. ఈ అర్జీలను వెంటనే ఆన్‌లైన్ చేస్తున్నామని, తమ పరిధిలో ఉన్న సమస్యలను 15 రోజుల్లోనే పరిష్కరిస్తామన్నారు. ఈ సదస్సులో డీటీ అన్నాజీరావు, ఆర్ఐ కన్నబాబు సర్వేయర్ సత్తిబాబు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

మునగపాక: అర్హులైన ప్రతి రైతుకు పట్టాదారు పుస్తకం అందజేస్తామని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. మండలంలోని టి.సిరసపల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ-సర్వేలో జరిగిన లోపాల సవరణకు దరఖాస్తులు తీసుకుంటామన్నారు. 51 మంది రైతులు పలు సమస్యలతో కూడిన దరఖాస్తులను అందజేశారు. సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, రీ-సర్వే డీటీ పడాల్, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలించి సమస్యల పరిష్కారం

పాయకరావుపేట: రైతులకు సంబంధించి భూ రికార్డులు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ జి.సత్యనారాయణ అన్నారు. మాసాహేబుపేట గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన 9 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డమూరి నీలవేణి, ఆర్ఐ త్రినాథ్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

పాయకరావుపేట: పెన్షనర్లు అందరూ తమ లైఫ్ సర్టిఫికెట్లను కార్యాలయానికి అందజేయాలని జిల్లా ట్రెజరీ అధికారి లక్ష్మీ సుభాషిణి తెలిపారు. ఆమె గురువారం పట్టణంలోని ట్రెజరీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెన్షనర్లు 2025 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీలోగా లైఫ్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలన్నారు. అనంతరం ట్రెజరీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ ట్రెజరీ అధికారి అనిత పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి పండగ

మునగపాక: మండలంలోని గణపర్తిలో గురువారం శ్రీమహాలక్ష్మి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మహిళలు పసుపు, కుంకుమలు అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గోకులపాడు, భీమవరం, పెదగుమ్ములూరు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఏఈ రాజశేఖర్ తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో మెయింటెనెన్స్ పనుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జాతీయ రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో సంస్కృతి గ్లోబల్ స్కూల్ సిబ్బంది

పరవాడ: జాతీయ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఢిల్లీ, భోపాల్‌లో ఈ నెల 13 నుంచి జనవరి 5 వరకు నిర్వహించనున్న 67వ జాతీయ రైఫిల్ షూటింగ్ పోటీలకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎస్.సురేంద్ర, సాయిరవి, వి.భాను, పి.అక్షయ్‌లు ఎంపికైనట్లు పాఠశాల కోచ్ రామ్మోహనరావు గురువారం మీడియాకు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల సీఈవో కె.నిశాంత్ అభినందించారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీకి జరిమానా



అధిక లోడుతో వెళ్తున్న లారీ

మునగపాక: పరిమితికి మించి లోడుతో వెళ్తున్న లారీకి రూ.68 వేలు అపరాధ రుసుం విధించినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. అనకాపల్లి నుంచి రాంబిల్లికి పరిమితికి మించి మునగపాక మీదుగా రాయి లోడుతో వెళ్తున్న లారీని పోలీసులు గురువారం గుర్తించారు. ఈ మేరకు లారీకి రూ.68వేలు జరిమానా విధించామన్నారు. ఇకపై అధిక లోడుతో వాహనాలు వెళితే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.